సాక్షి
జనగామ
మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



ఎండు గంజాయి స్వాధీనం

గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 31కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. - 8లో▸



తెలంగాణ కీర్తిని చాటాలి

క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి తెలంగాణ కీర్తిని చాటాలని కేయూ ప్రొఫెసర్ రాంచందర్ ఆకాంక్షించారు. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35°/19°

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎండ వేడి, ఉక్కపోత అధికమవుతుంది. రాత్రి పూట చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

విశేష పుష్పాలంకరణ



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామిని సోమవారం విశేష పుష్పాలతో అలంకరించారు. అర్చకులు రవీందర్ శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈఓ లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ మోహన్ పర్యవేక్షించారు.

యోధుల చరిత్రపై సినిమాలు రావాలి : ఎమ్మెల్యే



దేవరుప్పుల: తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన యోధుల చరిత్రపై సినిమాలు రావాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సాయుధ పోరాట యోధుల చరిత్రపై ఖాసీం దర్శకత్వంలో రూపొందిస్తున్న 'అమరుల యాదిలో'.. ఆల్బమ్ షూటింగ్‌ను సోమవారం ఆమె కడవెండిలో ప్రారంభించగా.. గ్రామ పరిసరాల్లో దొడ్డి కొమురయ్య అమరత్వంపై సాగిన నృత్య ప్రదర్శనను చిత్రీకరించారు. షూటింగ్‌ను ప్రజలు తిలకించారు. అంతకు ముందు పాలకుర్తి సోమేశ్వరాలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు.

సేవాలాల్ జయంతికి ఆహ్వానం



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 15న నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రావాలని కోరుతూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన కలెక్టర్ రిజ్వాన్ బాషాకు సోమవారం ఆహ్వానం అందించారు. జిల్లాకు గిరిజన భవన్ మంజూరైన నేపథ్యంలో నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్, వైస్ చైర్మన్ అజ్మీరా స్వామి, కోశాధికారి ధరావత్ శంకర్, డాక్టర్ బాలాజీ, గోవర్ధన్, నరేష్, రాజేందర్, నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌లో నితిన్ ప్రతిభ



బచ్చన్నపేట : కొన్నె గ్రామానికి చెందిన పాతకోటి నితిన్ బాడీ బిల్డింగ్‌లో జాతీయ స్థాయి మూడోర్యాంకు సాధించాడు. ఈ మేరకు నితిన్ తండ్రి మల్లేశం సోమవారం విలేకరులకు వెల్లడించారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ ఫిట్‌నెస్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన నితిన్ జనగామ పవర్ జిమ్‌లో శిక్షణ పొందాడు.

టాలెంట్ టెస్ట్‌కు 35 మంది హాజరు

జనగామ రూరల్: శామీర్‌పేట జెడ్పీఎస్ఎస్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు 12 మండలాల నుంచి మొత్తం 35 మంది టెన్త్ విద్యార్థులు హాజరయ్యారు. 40 మార్కులకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్ష పర్యవేక్షణలో 30 మంది గైడ్ టీచర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలపతిరెడ్డి, జిల్లా బాధ్యులు రాజు, ఖాసీం, ఆంజనేయచారి, యాకయ్య, నీరజ పాల్గొన్నారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 10 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ జితేందర్‌రెడ్డి తెలిపారు. మొదటి సెషన్‌లో జనరల్, ఒకేషనల్ 184 మందికి 182 మంది, రెండో సెషన్‌లో జనరల్, ఒకేషనల్ 234 మందికి 226 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. జనగామ, నర్మెట సెంటర్లను జిల్లా పరీక్షల నియంత్రణ అధికారులు ఎస్.శ్రీనివాస్, వి.శేఖర్ సందర్శించారు.


నత్తే నయం

16 ఏళ్లు గడిచినా పూర్తికాని పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లు

- రూ.370కోట్ల అంచనా.. రీ డిజైన్‌తో పెరిగిన ఎస్టిమేషన్
- కాంట్రాక్టర్లు మారినా అంతులేని జాప్యం
- పనుల్లో కనిపించని నాణ్యతా ప్రమాణాలు
- ప్రాజెక్టులు పూర్తయితే 32,740 ఎకరాలు సాగులోకి..



అసంపూర్తిగా ఉన్న చెన్నూరు రిజర్వాయర్ తూము



మధ్యలోనే నిలిచిపోయిన పాలకుర్తి రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులు

గోదావరి జలాలతో పాలకుర్తి నియోజకవర్గ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనులు 16 ఏళ్లు గడిచినా పూర్తి కాకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు జాప్యం కావడంతో రెండేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం టెండర్లను రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచి ప్రక్రియ పూర్తి చేసింది. రీ డిజైనింగ్‌తో అంచనా రెండింతలు పెరిగినా పనుల్లో పురోగతి లేదు.

- పాలకుర్తి టౌన్

ఉమ్మడి రాష్ట్రంలో పాలకుర్తి, చెన్నూరు ఊర చెరువులను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లుగా మార్చేందుకు అప్పటి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. 2009 ఫిబ్రవరి 27న పాలకుర్తి చెరువు వద్ద రిజర్వాయర్ పనులకు నాటి నీటిపారుదల శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య శంకుస్థాపన చేశారు. చెన్నూరులో 2015 సంవత్సరం అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పనులను ప్రారంభించారు. పాలకుర్తి రిజర్వాయర్ 0.25 టీఎంసీలు, చెన్నూరు రిజర్వాయర్ 0.5 టీఎంసీల కెపాసిటీతో పనులు చేపట్టారు. వీటికోసం మొదటి విడత రూ.320 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఆ తర్వాత ఆ మొత్తాన్ని రూ.370 కోట్లకు పెంచింది.

పెండింగ్‌లో మరో 670 ఎకరాల భూసేకరణ..

పాలకుర్తి రిజర్వాయర్ ఆయకట్టు 7,515 ఎకరాలు, చెన్నూరు రిజర్వాయర్ ఆయకట్టు 25,165 ఎకరాలుగా నిర్ణయించారు. ఈ రెండు రిజర్వాయర్ల కోసం 2,961 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 2,289 ఎకరాల భూ సేకరణ పూర్తయింది. మరో 670 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ కారణాలతో రిజర్వాయర్ల పనులు జరగలేదు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవతో చెన్నూరు రిజర్వాయర్ పనులు 12 ఏళ్ల క్రితం ప్రారంభించినా నేటికీ 70 శాతం పూర్తి కాలేదు. మూడేళ్ల క్రితం ఈ రెండు రిజర్వాయర్ల పనులు తిరిగి మొదలు పెట్టినా నత్త నడకన సాగుతున్నాయి.

ఇంకా పూర్తికాని తూములు

చెన్నూరు రిజర్వాయర్ పనుల్లో నాణ్యత ఎక్కడా కనిపించడంలేదని పరిశీలిస్తే అట్టే తెలిసిపోతుంది. పనులను గతంలో ఒక కాంట్రాక్టర్ టెండర్ ద్వారా దక్కించుకొని నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అప్పటి మంత్రి దయాకర్‌రావు సదరు కాంట్రాక్టర్‌ను తొలిగించి మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయినా పనుల్లో వేగం పెరగలేదు. అదే విధంగా కాల్వలు తవ్వి వదిలేసి ఏడాది గడిచిపోయింది. తూముల నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. కట్టపై మెటల్.. కట్టకు రివిట్‌మెంట్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కట్టకు అవతలి వైపు చిట్టడవిలా చెట్లు పెరిగాయి.

ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్షించినా..

స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి గతంలో వరంగల్, హైదరాబాద్, పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో రిజర్వాయర్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల కలెక్టర్ రిజ్వాన్ బాషా సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు. పాలకుర్తిలో బండ తొలగించే పనులు కొంతమేర జరిగాయి. రిజర్వాయర్ పనుల్లో భాగంగా కట్టకింద కిలోమీటరు దూరం తవ్వారు. చెరువు కట్ట నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు, స్టేషన్‌ఘన్‌పూర్ రోడ్డు వరకు పనులు కొంత వరకు వదిలేశారు. అవి ప్రాథమిక దశలోనే ఉండటంతో ఇప్పట్లో పనులు పూర్తియ్యేనా అనే సందేహాన్ని స్థానిక రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల తరబడి ఎదురుచూపులే..

రిజర్వాయర్ల పనులు పూర్తయితే ప్రతి ఏటా కనీసం రెండు పంటలు పండుతాయని రైతులు ఆశించారు. అయితే పనుల్లో జాప్యం కారణంగా రైతులకు ఎదురు చూపులు తప్పడంలేదు. ఐదేళ్లుగా పంటలు పండడం లేదని పాలకుర్తి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడమే జాప్యానికి కారణమని చెబుతున్న అధికారులు.. ఈ రెండు రిజర్వాయర్ల పనులు పూర్తి కావాలంటే మరో రూ.200 కోట్ల నిధులు అవసరమని అంచనా వేస్తున్నారు.

రూ.370 కోట్లతో పనులు..

చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్ల నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం రూ.470 కోట్లకు ఎస్టిమేషన్ వేసింది. ఆ తర్వాత రూ.370 కోట్లతో పనులు చేపడుతున్నాం. 3.45 కిలోమీటర్ల మేర కట్ట నిర్మించాల్సి ఉండగా 1.8 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. మిగతా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. చెన్నూర్ రిజర్వాయర్ ఏడు కిలోమీటర్ల మేర మెయిన్ కెనాల్ పనులు పూర్తయ్యాయి. రివిట్‌మెంట్ చేయాల్సి ఉంది.

- శ్రీకాంత్‌శర్మ, డీఈ పాలకుర్తి

పనులు పూర్తి చేయిస్తాం..



రిజర్వాయర్ల పనులు త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తా. పెండింగ్ పనులపై సీఎం రేవంత్‌రెడ్డికి నివేదించాను. నిధులు కేటాయిస్తామ ని హామీ నిచ్చారు. పనుల పురోగతిపై పలుమార్లు అధికారులతో సమీక్ష నిర్వహించాను. పాలకుర్తి మండల ప్రజల ఆకాంక్ష మేరకు రెండు రిజర్వాయర్లను అందుబాటులోకి తీసుకువస్తాం. నియోజకవర్గ రైతుల కళ్లలో ఆనందం చూడడమే నా లక్ష్యం.

- మామిడాల యశస్వినిరెడ్డి, ఎమ్మెల్యే

మినీ మేడారానికి సిద్ధం

- ముగింపు దశకు చేరుకున్న పనులు
- రేపటినుంచి 15వ తేదీ వరకు జాతర

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ జాతరకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న జాతరకు వచ్చే భక్తుల సేవల కోసం అన్ని ఏర్పాట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నివారించేందుకు మేడారం ఎండోమెంట్ కార్యాలయంలో ఒక ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచారు.

అడుగడుగునా నిఘా..

మేడారంలో భక్తుల రద్దీని, దొంగలు చేతివాటం ప్రదర్శించకుండా నిత్యం పర్యవేక్షించేందుకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, ఆర్టీసీ వై జంక్షన్, మేడారం ఐలాండ్ ప్రాంతం, గద్దెల ప్రాంగణం, జంపన్నవాగు తదితర ప్రాంతాల్లో గతంలో ఉన్న సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించారు. అన్నింటినీ మేడారంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు. పుటేజీలను నిత్యం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

తాత్కాలిక డ్రెస్సింగ్ గదుల ఏర్పాటు

జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద భక్తులు దుస్తులు మార్చుకునేందుకు జీఆర్ షీట్స్‌తో 10 తాత్కాలిక డ్రెస్సింగ్ గదులను అందుబాటులో ఉంచారు. భక్తుల జల్లు స్నానాల కోసం 10 బాటరీ ఆఫ్ ట్యాప్‌లను ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేస్తున్నారు.



జంపన్న వాగు స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన డ్రెస్సింగ్ గదులు



దోమలు, ఈగల నివారణకు మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

జాతరకు వచ్చే భక్తులు అమ్మవార్లకు మొక్కుగా కోళ్లను సమర్పించడం ఆనవాయితీ. ఎక్కడపడితే అక్కడ కోళ్ల, మేకల వ్యర్థాలు వేయకుండా షాపుల వద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశారు. గద్దెల సమీపంలో, రోడ్ల వెంట, భక్తులు విడిది చేసే షెడ్ల వద్ద ఈగలు, దోమలు వ్యాపించకుండా కెమికల్ పిచికారీ చేశారు.

భద్రత.. భారీగా

- జాతర విధులకు వెయ్యి మంది సిబ్బంది
- బుధవారం నుంచి ఆదివారం వరకు కొనసాగనున్న బందోబస్తు

- వివరాలు 8లో▸

విజయబావుటా ఎగురవేయాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయబావుటా ఎగురవేసేలా పాటుపడాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ కార్యాలయంలో సమన్వయ కమిటీల నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన ప్రభుత్వం కులగణనపై, ఎస్సీ వర్గీకరణపై సాహసోపేత నిర్ణయం తీసుకుందన్నారు. అయితే ఇష్టం లేని బీజేపీ, బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నట్లు ఆరోపించారు.

సర్వే ఆధారంగా అభ్యర్థుల ఎంపిక

సర్వే ఆధారంగా ప్రజాబలం ఉన్న గెలుపు గుర్రాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలని, ఈ విషయమై యూత్ కాంగ్రెస్ నాయకులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ గెలుపునకు ఐక్యంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, రాష్ట్ర నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్నతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, పోగుల సారంగపాణి, బూర్ల శంకర్, శ్రీధర్‌రావు, లింగాజీ, జగదీష్‌రెడ్డి, నీరటి ప్రభాకర్, కొలిపాక సతీష్ తదితరులు పాల్గొన్నారు.


'ఉపాధి'లో 5వ ర్యాంకు

- అధికారుల పర్యవేక్షణ.. సిబ్బంది అంకితభావం ఫలితం
- జిల్లాలో ఉపాధి హామీ పథకం పనుల సద్వినియోగం
- నిరుపేద కుటుంబాలకు ప్రయోజనం

జనగామ: ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో జిల్లా రాష్ట్రంలో ఐదవ స్థానంలో నిలిచింది. అధికారుల పర్యవేక్షణ.. క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావం రెండూ కలిపి నిరుపేద కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మరో నెల సమయం మిగిలి ఉండగానే.. ఉత్తమ ర్యాంకు సాధించిన జనగామ.. చివరి వరకు 3వ స్థానంలో నిలిచేందుకు పోటీ పడుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 61,794 కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించగా, ఇందులో 953 కుటుంబాలు వంద రోజుల పనులు పూర్తి చేశాయి. పనులు చేసిన కూలీలకు రూ.81.09 కోట్ల మేర వేతనాలు, మెటీరియల్ పేమెంట్లు జరిగాయి.

లక్ష్యం మేరకు పనిదినాల కల్పన..

జిల్లాలోని 12 మండలాల పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరం 27.52 లక్షల పనిదినాలు టార్గెట్ కాగా.. ఇప్పటి వరకు 27.43 లక్షల పని దినాలు పూర్తయ్యాయి. మొత్తం 1,17,802 జాబ్ కార్డుల్లో.. 2,31,254 మంది కూలీలు ఉన్నారు. ఇందులో యాక్టివ్ జాబ్ కార్డులు 81,120 ఉండగా, రోజు వారీగా పని చేసే కూలీలు 1,30,359 మంది ఉంటారు. గత ఏడాది మార్చి నుంచి ప్రస్తుత ఫిబ్రవరి నెల వరకు 16 కేటగిరీల్లో 61,794 మంది కుటుంబాలకు గాను 95,243 మందికి పనులు కల్పించారు. ప్రధానంగా పొలం బాటలు, వనమహోత్సవం, అవెన్యూ ప్లాంటేషన్లు, మహిళాశక్తి ఉపాధి భరోసా, జలనిధి, రూరల్ శానిటేషన్, రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు చేయిస్తున్నారు. కూలీల వేతనాలు రూ.64.09 కోట్లు, మెటీరియల్ పేమెంట్లు రూ.13.03 కోట్లు మొత్తం కలిపి రూ.81.09 కోట్ల మేర చెల్లింపులు జరిగాయి. కూలీలు పనులు చేసిన ఎనిమిది రోజుల్లోగా వేతనాలు విడుదల చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రోజువారీ కూలి రూ.300 ఉండగా, యావరేజ్‌గా రూ.227.20 వస్తోంది. నర్మెట, రఘునాథపల్లి, జఫర్‌గఢ్ మండలాలకు సంబంధించి నూరు శాతం బిల్లులు, కూలీలకు వేతనాలు చెల్లించారు. అత్యధికంగా కూలీలు పనులు చేసిన మండలాల జాబితాలో జనగామ మొదటి స్థానంలో ఉంది.



జిల్లాలో ఉపాధి హామీ పథకం వివరాలు

మొత్తం జాబ్ కార్డులు	1,17,802
కార్డుల్లోని సభ్యులు	2,31,254
పనులు చేసిన కూలీలు	95,243
టార్గెట్ పనిదినాలు	27.52 లక్షలు
పూర్తి చేసిన పనిదినాలు	27.43 లక్షలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జోరుగా 'ఉపాధ్యాయ' నామినేషన్లు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి చివరి రోజున 18 మంది నామినేషన్
- మొత్తంగా 23 మంది 50 సెట్లు దాఖలు
- భారీ ర్యాలీలతో హోరెత్తిన నల్లగొండ
- నేడు నామినేషన్ల పరిశీలన

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి చివరిరోజు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులనుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి నామినేషన్లు స్వీకరించారు. సోమవారం 18 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్లు వేయగా.. మొత్తంగా 23 మంది 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు కావడంతో పెద్దఎత్తున సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో మంగళవారం వాటి పరిశీలన జరగనుంది. వాటిల్లో నిబంధనలకు అనుగుణంగా లేని నామినేషన్లను తిరస్కరిస్తారు. ఈనెల 13వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ తరువాత పోటీలో ఉండే అభ్యర్థులను ఖరారు చేయనున్నారు. ఈనెల 27న పోలింగ్ జరగనుంది. మార్చి 3న కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది.

భారీగా సమావేశాలు, ర్యాలీలు

ఇంతకుముందే నామినేషన్లు వేసిన వారు కూడా సోమవారం పెద్దఎత్తున సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి మరోసెట్ దాఖలు చేశారు. ప్రధాన సంఘాల మద్దతు కలిగిన అభ్యర్థులైన పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పులి సరోత్తమ్‌రెడ్డి, పూల రవీందర్, ఎస్.సుందర్‌రాజు యాదవ్ తదితరులు నామినేషన్ పత్రాలను సమర్పించారు. పూల రవీందర్ బహుజనవాదంతో పెద్దఎత్తున ఎన్జీ కాలేజీ నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయగా, పీఆర్‌టీయూ–టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి కూడా ఎన్జీ కాలేజీ నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థిగా, టీపీయూఎస్ మద్దతుతో పులి సరోత్తంరెడ్డి భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ సమర్పించారు. సుందర్‌రాజు యాదవ్ వాహనాల్లో ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. సుందర్‌రాజు యాదవ్, పూల రవీందర్ నామినేషన్ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో పాటు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి నామినేషన్ కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎస్.రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీచర్స్ జేఏసీ అభ్యర్థి, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి గతంలోనే పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి నామినేషన్లు దాఖలు చేశారు. ఇక చివరి రోజు కూడా హర్షవర్ధన్ రెడ్డి తరఫున ఆయన కూతురు హేమంత సంధ్యారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఇలా మొత్తంగా 23 మంది 50 సెట్ల నామినేషన్లు వేశారు.

13 వరకు ఉపసంహరణ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పూర్తయినందున బుధ, గురువారాల్లో నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా నామినేషన్లు ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంది. ఆ తర్వాత పోటీలో ఉండే అభ్యర్థులను ప్రకటిస్తారు.



బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న పులి సరోత్తంరెడ్డి, చిత్రంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తదితరులు



నామినేషన్ వేస్తున్న పీఆర్‌టీయూ-టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి



స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, చిత్రంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య 25,797

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు పెరిగారు. డిసెంబరు 30న ప్రకటించిన జాబితా ప్రకారం ఉపాధ్యాయ ఓటర్లు 24,905 మంది ఉన్నారు. అయితే నామినేషన్ల వరకు కూడా ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో మరో 892 మంది ఓటర్లు కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. తుది ఓటరు జాబితాకు ఈ సప్లిమెంటరీ జాబితా జత చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మొత్తం 25,797 మంది ఓటర్లు ఉన్నారు.

సేవా సంకల్పం చాలా గొప్పది

- పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నరసింహారెడ్డి

జనగామ రూరల్: సమాజంలోని అవసరార్థులకు సేవ చేయాలనే సంకల్పం ఉండడం చాలా గొప్ప విషయమని హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జనగామలో లయన్ చందుపట్ల రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రీజియన్ మీట్‌లో ఆయన మాట్లాడారు. విశ్వవ్యాప్తంగా అవసరార్థులకు ప్రత్యేకించి అంధత్వ నివారణకు చేస్తున్న నిస్వార్థ సేవ అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డిని సన్మానించారు. అనంతరం సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్‌లు పజ్జూరి జయహరి, రంగరాజు ప్రవీణ్‌కుమార్, కూరెల్ల ఉపేందర్, హనుమాండ్ల రాజిరెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, కన్న పరశురాములు పాల్గొన్నారు.



జస్టిస్ నరసింహారెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో సైట్ ఇంజినీర్ దుర్మరణం

● గొల్లచర్లలో ఘటన


రాజేశ్(ఫైల్)

డోర్నకల్: రోడ్డు ప్రమాదంలో ఓ సైట్ ఇంజినీర్ దుర్మరణం చెందాడు. ఈఘటన మండలంలోని గొల్లచర్ల శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం నాయక్‌పల్లి గ్రామానికి చెందిన తాటికొండ రాజేశ్(28) డోర్నకల్‌లో జరుగుతున్న అమృత్ ఓవర్‌హెడ్ నిర్మాణ పనుల వద్ద సైట్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై మహబూబాబాద్ నుంచి డోర్నకల్‌కు వస్తుండగా గొల్లచర్ల సబ్ స్టేషన్ మలుపు వద్ద వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన పడింది. ఈ ఘటనలో రాజేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఘటనాస్థలికి చేరుకునే సమయానికి మృతి చెందాడు. పోలీసులు రాజేశ్ మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డోర్నకల్ సీఐ బి.రాజేశ్ తెలిపారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

● కాంగ్రెస్ పార్టీలో విలువ ఉండడం లేదన్న వీడియో వైరల్

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం విలాసాగర్ మాజీ సర్పంచ్ అందె సత్యనారాయణ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తీసుకెళ్లారు. ప్రస్తుతం సత్యనారాయణ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. కాగా, మాజీ సర్పంచ్ సత్యనారాయణ ఆత్మహత్యాయత్నానికి ముందు రికార్డు చేసిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. కాంగ్రెస్ గెలుపు తర్వాత పార్టీలో చేరిన వారికే ప్రాధాన్యం ఉందని, ముప్పై ఏళ్లుగా పార్టీలో కొనసాగుతున్న తన లాంటి నాయకులు, కార్యకర్తలకు విలువ లేదని వీడియోలో సత్యనారాయణ పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఉన్న వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, ఈ విషయాన్ని పలుమార్లు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వీడియోలో వెలిబుచ్చారు. తన ఆత్మహత్యతోనైనా కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నానని సత్యనారాయణ పేర్కొన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు మాత్రం వీడియోలో సత్యనారాయణ వ్యాఖ్యలను ఖండించారు.

నేడు రెడ్ రిబ్బన్ క్లబ్‌ల ప్రారంభం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మంగళవారం రెడ్‌రిబ్బన్ క్లబ్‌లు ప్రారంభించనున్నట్లు కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ సోమవారం తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు సెనేట్ హాల్‌లో హెచ్ఐవీ, ఎస్‌టీఐపై జిల్లా స్థాయి అవగాహన నిర్వహించనున్నామని తెలిపారు. వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి. రామచంద్రం తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మేడారంలో ఎండోమెంట్ కార్యాలయంలో ఉన్న ఫైర్ ఇంజన్



సీసీ కెమెరాలకు మరమ్మతు చేస్తున్న టెక్నీషియన్



భద్రత.. భారీగా

మినీ మేడారానికి పటిష్ట బందోబస్తు

● విధులకు వెయ్యి మంది పోలీసులు
● బుధవారం నుంచి ఆదివారం వరకు డేగకళ్లతో నిఘా
● జాతరకు పోలీసు శాఖ ఏర్పాట్లు పూర్తి

ములుగు: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న మినీ జాతరకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రోజు వారీగా 60 నుంచి 100 మంది బందోబస్తు చేపడుతుండగా బుధవారం జరిగే మండమెలిగె నుంచి మినీ జాతర పూర్తయ్యే వరకూ జిల్లాలోని తొమ్మిది మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న సివిల్, ఏఆర్, సీఆర్పీఎఫ్ నుంచి వెయ్యి మందికి ఎస్పీ శబరీశ్ డ్యూటీలు కేటాయించారు. ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ పర్యవేక్షణ చేస్తున్నారు. వచ్చే ఆదివారం వరకు భద్రతాచర్యలు కొనసాగనున్నాయి. షిఫ్టుల వారీగా కేటాయించే విధులకు ఓఎస్డీ మహేశ్ బాబాసాహెబ్ గితే, ట్రాఫిక్ కంట్రోల్‌కు ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ట్రాఫిక్ పర్యవేక్షకులుగా ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, ములుగు సీఐ శంకర్ వ్యవహరించనున్నారు. ఇక ఆలయ ప్రాంతంలో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) సదానందం, డీసీఆర్బీ డీఎస్పీ కిశోర్ కుమార్ బందోబస్తు చేపడుతారు. ములుగు డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్ పర్యవేక్షణ చేయనున్నారు.


మాంస విక్రయ షాపులకు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేస్తున్న సిబ్బంది

స్నానఘట్టాలు, దుస్తులు మార్చుకునే గదులు, గద్దెల ప్రాంగణంలో మహిళా సిబ్బంది..

జంపన్నవాగుపై ఏర్పాటు చేసిన స్నానఘట్టాలు, దుస్తులు మార్చుకునే గదులు, అమ్మవార్లను దర్శించుకునే మహిళా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మహిళా ఎస్సైలు, కానిస్టేబుళ్లకు విధులు కేటాయించారు. సుమారు 60 నుంచి 100 మందికి షిఫ్టుల వారీగా డ్యూటీలు కేటాయించారు. ఇక చోరీలు, పిక్‌ప్యాకెటింగ్, అనుమానిత వ్యక్తులను గుర్తించడానికి బ్లూకోల్ట్స్‌తో పాటు ప్రత్యేక సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి



మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ సారి వెయ్యి మందితో ట్రాఫిక్, శాంతిభద్రతలను పర్యవేక్షించనున్నాం. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని షిఫ్టుల వారీగా సిబ్బంది సంఖ్య పెంచుతాం. భక్తుల సౌకర్యార్థం ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు, రూట్ మ్యాప్‌ల సైన్ బోర్డులను ఏర్పాటు చేశాం. జంపన్నవాగుపై స్థలం తక్కువ ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఆగే భక్తులు కొంత సమన్వయంతో వాహనాలను క్రమపద్ధతిలో పార్క్ చేసుకోవాలి. ఎవరికైనా సమస్య తలెత్తితే బందోబస్తులో ఉన్న పోలీసు అధికారుల సాయం కోరాలి.

– డాక్టర్ శబరీశ్, ఎస్పీ, ములుగు

జాతర నాలుగు రూట్లుగా విభజన..

మినీ మేడారం జాతరను పోలీసు శాఖ నాలుగు రూట్లుగా విభజించింది. 15 రోజుల నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉండడంతో రూట్లను ఏర్పాటు చేసి అధికారులను కేటాయించింది.

రూట్–1

హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలు పస్రా–వెంగళాపురం–నార్లాపూర్–కొత్తూరు మీదుగా జంపన్నవాగు, హరిత జంక్షన్ ద్వారా ఐటీడీఏ గెస్ట్ హౌస్ వెనుక నుంచి అమ్మవారి ఎదురుకోళ్ల గుడి పక్కకు చేరుకుని ఇక్కడ పార్క్ చేయాలి. ఎదురుకోళ్లగుడి పార్కింగ్‌లో స్థలం లేకపోతే వాహనాలకు హరిత హోటల్, ఇంగ్లిష్ మీడియం పాఠశాల ఎదుట పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నారు. తిరుగు ప్రయాణంలో హరిత వై జంక్షన్, ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఆర్టీసీ బస్టాండ్, ఎలుబాక మీదుగా చింతల్ క్రాస్‌కు చేరుకునేలా రూట్ ఏర్పాటు చేశారు.

రూట్–2

భూపాలపల్లి, కరీంనగర్ మీదుగా వచ్చే భక్తుల వాహనాలు నార్లాపూర్, కొత్తూరు, జంపన్నవాగు మీదుగా ఎదురుకోళ్లగుడికి చేరుకోవాలి. తిరుగు ప్రయాణం రూట్–1 వాహనాలతో పాటే చింతల్ క్రాస్ నుంచి బయటకు వెళ్లాల్సి ఉంటుంది.

రూట్–3

ఛత్తీస్‌గఢ్, భద్రాద్రికొత్తగూడెం, ఏటూరునాగారం ప్రాంతాల వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలు ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో అమ్మవారి ఆర్చ్ మీదుగా మేడారం సమీపంలోని శ్రీరాంసాగర్ చెరువు నుంచి వీఐపీ పార్కింగ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణం కూడా ఇదే రూట్‌లో ఉంటుంది.

రూట్–4

హైదరాబాద్, వరంగల్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు పస్రా–ఎస్ఎస్‌తాడ్వాయి మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి. భూపాలపల్లి, కరీంనగర్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు చింతల్ క్రాస్–ఎలుబాక మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి జంపన్నవాగు, అమ్మవారి గద్దెలకు నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. భక్తుల సంఖ్య తక్కువ ఉంటే స్థానికంగా ఆటోలను ఏర్పాటు చేయనున్నారు. ఇక వీవీఐపీ పార్కింగ్‌కు నేరుగా వెళ్లాలనుకునే భక్తులు శ్రీరాంసాగర్‌చెరువు మీదుగా చేరుకోవాలి.

భక్తుల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నంబర్

మినీ మేడారం జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ములుగు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 18004257109 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో పాటు షిఫ్టుల వారీగా ముగ్గురు అధికారులను సహాయకులుగా కేటాయించారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జూనియర్ అసిస్టెంట్ శివకుమార్(9010738645), మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు జూనియర్ అసిస్టెంట్ రాకేశ్(9966454235), రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు జూనియర్ అసిస్టెంట్ దిలీప్(8555955540)ను కేటాయిస్తూ కలెక్టర్ దివాకర ఉత్తర్వులు జారీ చేశారు.

మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలు

● అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలి
● సమీక్షలో కలెక్టర్ రిజ్వాన్ బాషా


మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

పాలకుర్తి టౌన్ : శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలను అధికారులు సమన్వయంతో విజయవతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం ఆలయ కల్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో జాతరలో ప్రచార ఫ్లెక్సీలు ఏర్పా టు చేయొద్దన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు పీఆర్ శాఖ ఆధ్వర్యాన 130 మంది జీపీ సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. నాలుగు చోట్ల వాహనాల పార్కింగ్, గుట్టపైన దర్శనానికి వెళ్లే భక్తులకు క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వరంగల్, తొర్రూరు, జనగామ, సూర్యాపేట డిపోల నుంచి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడించా ల ని సంబంధిత అధికారులకు సూచించారు. డీసీపీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ బందోబస్తు కు 200 మంది పోలీసులను నియమించడంతో పాటు సీసీ కెమారులు, పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేట్ వాహనాల పా ర్కింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ట్రాన్స్‌కో డీఈ రాంబాబు మాట్లాడతూ జాతర ముగిసేంత వరకు నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీఎంహెచ్ఓ మల్లికార్జున్ మాట్లాడుతూ జారతలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు ఆలయ ఆవరణలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మహాశిరాత్రి జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీపీఓ స్వరూప, ఆర్డీఓ వెంకన్న, డీఆర్‌డీఓ వసంత, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, ఆలయ ఈఓ మోహన్‌బాబు, సీపీఓ లక్ష్మీప్రసన్న, ఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను కొట్టొద్దు : కలెక్టర్

ఉపాధ్యాయులు విద్యార్థులను కొట్టవద్దని.. ప్రేమతో చదువు నేర్పాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి సందర్శించారు. ఇటీవల గురుకుల పాఠశాలలో విద్యార్థినులను ఉపాధ్యాయురాలు కొట్టిన ఘటన గురించి ప్రిన్సిపాల్ స్వరూపను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల మధ్య గొడవను విద్యార్థుల మీదకు తేవద్దన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థినులకు పాఠాలు బోధించారు. ఆయన వెంట ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాకేష్ తదితరులు ఉన్నారు.

నూతన విద్యుత్ సర్వీసుల మంజూరు సులభతరం

● ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాదవ్

జనగామ: వినియోగదారులకు మెరుగైన సేవలందించే చర్యల్లో భాగంగా కొత్త విద్యుత్ సర్వీసుల మంజూరు సేవలను సులభతరం చేసినట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టి.వేణుమాదవ్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నూతన కనెక్షన్ దరఖాస్తును సాంకేతిక లోపంతో తిరస్కరించకుండా చర్యలు తీసుకుంటామని, నిబంధనల మేరకు పత్రాలు సమర్పించుకునేందుకు మరో అవకాశం ఇస్తామని చెప్పారు. ఇందుకు వినియోగదారుడి ఫోన్‌కు మెసేజ్ రూపంలో సమాచారం పంపిస్తామని తెలిపారు. ధ్రువీకరణ పత్రాలను నిర్దిష్ట సమయంలో సమర్పిస్తే ఆలస్యం కాకుండా కనెక్షన్ ఇచ్చే వీలుందని వివరించారు. వినియోగదారులు అప్లికేషన్ ఏ స్టేజీలో ఉందో తెలుసుకునేందుకు కొత్తగా ట్రాకింగ్ వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్రీడలతో తెలంగాణ కీర్తిని చాటాలి


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న రాంచందర్

మామునూరు : క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి, తెలంగాణ కీర్తిని చాటాలని కేయు ప్రొఫెసర్ కె.రాంచందర్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తాబేటి రాజేందర్, ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి పేర్కొన్నారు. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో హనుమకొండ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ముఖ్యఅతిథులుగా వారు హాజరై పలు జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులును పరిచయం చేసుకున్నారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ.. మరుగున పడిపోతున్నా గ్రామీణ క్రీడలను వెలికితీసి ప్రోత్సహించే ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో హైదరాబాద్ జట్టు విజేతగా నిలువగా.. రెండు, మూడో స్థానంలో మెదక్, రంగారెడ్డి జట్లకు ట్రోఫీ, బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పి.సాంబశివ రావు, నీవన్, అభిషేక్, కోచ్ కృష్ణ, ప్రమోద్‌కుమార్, అశోక్‌బాబు, అభినవ్, వినయ్‌కుమార్, రాజేశ్వర్, నాగరాజు, సుమలత, వినయ్, మధు, సృజన, రవి, శశాంక్, ప్రశాంత్, భగత్, లక్ష్మీపతి, నరేశ్, అర్జున్, సుష్మ, వెన్నెల,పలు జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

తెలంగాణ బడిలో ఒడిశా విద్యార్థులు..

● పాఠశాలలో చేర్పించిన మహమూద్‌పట్నం ఉపాధ్యాయులు
● పిల్లలకు అర్థమయ్యే భాష హిందీలోనే బోధన


ఒడిశా విద్యార్థులతో హెచ్ఎం, టీచర్

కేసముద్రం: ఇటుక బట్టీలో పని చేసేందుకు వచ్చిన ఒడిశా కార్మికులను ఒప్పించి, వారి పిల్లలను బడిలో చేర్పించారు.. వారికి అర్థమయ్యే భాష హిందీలోనే పాఠాలు బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్నం యూపీఎస్ టీచర్లు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహమూద్‌పట్నం ఉమ్మడి జీపీ పరిధి కాలనీతండా సమీపంలోని ఇటుకబట్టీలో పనిచేసేందుకు ఇటీవల ఒడిశాకు చెందిన కొంత మంది కార్మికులు కుటుంబాలతో సహా వచ్చారు. తల్లిదండ్రులు పనులు చేస్తుండగా, బడిలో ఉండాల్సిన పిల్లలు వారివెంటే ఉంటున్నారు. ఈవిషయం తెలుసుకున్న మహమూద్‌పట్నం యూపీఎస్ హెచ్ఎం సురేశ్‌నాయుడు, టీచర్ సంద్ర రాధిక, సీఆర్పీ సుల్తానా వెళ్లారు. ‘ మీ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మా బడికి పంపించండి’ అంటూ కార్మికులకు చెప్పారు. దీంతో 14 మంది పిల్లలను తల్లిదండ్రులు సోమవారం పాఠశాలలో చేర్పించారు. ఆ పిల్లలకు హెచ్ఎం సురేశ్‌నాయుడు, టీచర్ రాధిక, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కే.ఉమారాణి విద్యాసామగ్రి అందజేశారు. పిల్లలకు అర్థమయ్యే భాష హిందీలోనే ఉపాధ్యాయులు పాఠాలు బోధించారు. కాగా, ఒడిశా పిల్లలను ఇక్కడి పాఠశాలలో చేర్పించడమేకాకుండా వారికి అర్థమయ్యే భాష హిందీలోనే బోధిస్తున్న ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యావంతులు అభినందించారు.

వరంగల్ జిల్లాకు చేరుకున్న సర్వే హెలికాప్టర్

● నేడు వర్ధన్నపేటలో ఏరియల్ సర్వే


హెలికాప్టర్ వద్ద కలెక్టర్

కాజీపేట రూరల్ : మున్సిపాలిటీల పూర్తి వివరాలు (స్థలాలు, ఇళ్లు, భవనాలు, చెరువులు, గుట్టలు, రోడ్లు, హాస్పిటళ్లు, తదితర సమాచారం) తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా వంద మున్సిపాలిటీలను ఎంపిక చేసింది. ఇందులో తెలంగాణ నుంచి పది ఎంపికయ్యాయి. నక్ష ద్వారా జియో ట్యాగింగ్, టుడీ/త్రీడీ మ్యాపింగ్‌తో ఆయా మున్సిపాలిటీల్లో ఆర్.వి. అసోసియేట్ ఏజెన్సీ ద్వారా హెలికాప్టర్‌తో ఏరియల్ సర్వే చేస్తోంది. ఈ నేపథ్యంలో పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా వరంగల్ జిల్లాలో పలు ప్రాంతాలను సర్వే చేయడానికి హెలికాప్టర్ నగరంలోని సేయింట్ గ్యాబ్రియల్ స్కూల్‌లో ల్యాండ్ అయింది. ఆది, సోమవారాల్లో జగిత్యాల, హుస్నాబాద్‌లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేశారు. మంగళవారం వర్ధన్నపేట మున్సిపాలిటీ ప్రాంతంలో సర్వే చేయనున్నారు. ఏరియల్ సర్వేకు కమిటీ సభ్యులుగా వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ల్యాండ్ రికార్డు అధికారి, ఇరిగేషన్ ఈఈ, ఆర్అండ్‌బీ ఈఈ, డీపీఓ, వర్ధన్నపేట ఏసీపీ ఉన్నారు.

సర్వే హెలికాప్టర్‌ను సందర్శించిన కలెక్టర్ సత్యశారద

కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ గ్రౌండ్‌లో ల్యాండ్ అయిన హెలికాప్టర్‌ను వరంగల్ కలెక్టర్ సత్యశారద సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియల్ సర్వే వివరాలు తెలుసుకున్నారు. నావిగేటర్ నిదేశ్‌కుమార్, మేనేజర్ మల్లారెడ్డి ఏరియల్ సర్వే సిస్టమ్, ప్రాంతాల మ్యాపింగ్, టెక్నాలజీ, ఫొటోగ్రఫీ క్యాప్చరింగ్, రికార్డు సిస్టమ్, ఇతర సాంకేతికపర వివరాలను కలెక్టర్‌కు వివరించారు.

31 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్..
● ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు వెల్లడి


ఖిలా వరంగల్: నిందితులను చూపుతున్న ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు

ఖిలా వరంగల్ : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 31కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆర్పీఎఫ్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద మహారాష్ట్రలోని ఐరోలి కట్నానవీ గ్రామానికి చెందిన రాహుల్ రామ్ లఖన్ తివారీ, ముంబైలోని ఘన్సోలి థానే అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఆశీష్ రామ్‌నాయక్ యాదవ్ అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా రూ.7.75 లక్షల విలువైన 31కిలోల గంజాయి లభ్యమైంది. వెంటనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కు అప్పగించినట్లు ఆర్పీఎఫ్ ఎస్సై పేర్కొన్నారు.

కేసముద్రంలో నాలుగు కిలోలు..

కేసముద్రం: పోలీసులు నాలుగు కిలోల గంజాయిని పట్టుకుని ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. కేసముద్రం మండలం ఇంటికన్నెకు చెందిన బానోత్ హరినాథ్, బయ్యారం మండలం బాల్య తండాకు చెందిన గుగులోత్ చరణ్, మరిపెడ మండలం గమ్యతండాకు చెందిన లునావత్ ప్రవీణ్ రైలులో ఒడిశాకు వెళ్లారు. అక్కడ నబీన్‌ప్రధాన్ అనే వ్యక్తి వద్ద రూ.లక్ష విలువైన నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసి రైల్లో మహబూబాబాద్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి సోమవారం కేసముద్రం వచ్చారు. ఉప్పరపల్లి రోడ్డువైపు వాహనం కోసం ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో అటువైపు సిబ్బందితో వెళ్లిన ఎస్సైకి వారు అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ, ఎస్సై తెలిపారు.

వరంగల్‌లో 1,280 గ్రాములు..

వరంగల్: వరంగల్ గోవిందరాజులగుట్ట వద్ద గిర్మాజీపేటకు చెందిన వీరమల్ల సరోజిని, భూపాలపల్లి జిల్లా కారల్‌మార్క్స్‌కాలనీకి చెందిన మహ్మద్ అజార్ వద్ద సుమారు రూ.32వేల విలువైన 1,280 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. సోమవారం వీరి వద్ద గంజాయి లభించగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంజాయి చాక్లెట్లు స్వాధీనం..

గీసుకొండ : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో పోలీసులు సోమవారం ముగ్గురి నుంచి 36 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. పార్కు వద్ద గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై ప్రశాంత్‌బాబు సిబ్బందితో వెళ్లారు. బిహార్‌కు చెందిన సన్నీ కుమార్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వివేక్‌యాదవ్, మధ్యప్రదేశ్‌కు చెందిన శుభం విశ్వకర్మను పట్టుకున్నారు. ఒక్కొక్కరి వద్ద 12 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై చెప్పారు.

మహాకుంభాభిషేకం విజయవంతం

● కాళేశ్వరం దేవస్థానం ఈఓ ఎస్.మహేశ్


ఈఓ మహేశ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వరముక్తీశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజులపాటు వైభవోపేతంగా నిర్వహించిన మహాకుంభాభిషేక మహోత్సవాలకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఈఓ ఎస్.మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగుల సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసి మహాకుంభాభిషేక ఘట్టం దిగ్విజయం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తల్లి

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు

● నానమ్మ ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి..
● అందరికీ తెలిసిందని తల్లీ ఆత్మహత్యాయత్నం
● మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం జోగ్యాతండాలో ఘటన


నిత్యశ్రీ, వరుణ్‌తేజ్

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం జోగ్యాతండాలో అమానుషం జరిగింది. తల్లి తన కుమారుడు, కుమార్తెకు కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి తాగించింది. ఇద్దరు చిన్నారులు హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పిల్లల నానమ్మ ఫిర్యాదుతో సోమవారం ఆలస్యంగా ఈ ఘటన వెలుగు చూసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగ్యాతండాకు చెందిన ఆటోడ్రైవర్ వాంకుడోత్ వెంకటేశ్‌కు ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన ఉషతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి వరుణ్‌తేజ్, నిత్యశ్రీ చిన్నారులు ఉన్నారు. వెంకటేశ్ అనారోగ్యంతో నాలుగు నెలల క్రితం చనిపోయాడు. ప్రస్తుతం ఉష తన పిల్లలతో వెంకటేశ్ తల్లిదండ్రులు వాంకుడోత్ శ్రీను, బుజ్జి ఇంటిలోని ఓ గదిలో నివాసం ఉంటుంది. ఈ నెల 5న ఉష బయటకు వెళ్లిన సమయంలో వరుణ్‌తేజ్, నిత్యశ్రీ ఆడుకుంటూ ఒక్కసారి కిందపడి వాంతులు చేసుకున్నారు. నానమ్మ బుజ్జితోపాటు బంధువులు పిల్లలను పరిశీలించగా ఆకు పచ్చ రంగులో వాంతులు చేసుకుంటుండగా ఏమైందని అడగగా, అమ్మ కూల్‌డ్రింక్ తాగించిందని తెలిపారు. ఉష ఇంటికి రాగానే పిల్లలను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులపాటు చికిత్స అందించిన వైద్యులు పిల్లల శరీరాల్లో పురుగుమందు ఆనవాళ్లు ఉన్నాయంటూ అనుమానం వ్యక్తం చేయడంతో బంధువులు, కుటుంబసభ్యులు ఉషను నిలదీశారు. దీంతో ఆమె పిల్లలకు కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి తాగించినట్లు ఒప్పుకుంది. బంధువులు ఉష ఇంట్లో వెతకగా అరలీటర్ గడ్డి మందు డబ్బా లభ్యమైంది. పిల్లల పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఆ చిన్నారుల్లో నిత్యశ్రీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

నానమ్మ ఫిర్యాదుతో వెలుగులోకి..

పిల్లలకు గడ్డిమందు తాగించినట్లు తల్లి ఒప్పుకోవడంతో పిల్లల నానమ్మ బుజ్జి సోమవారం డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. బుజ్జి విలేకరులతో మాట్లాడుతూ తమ కోడలు ఉష ప్రవర్తనపై తమకు అనుమానాలు ఉన్నాయని, తన స్వేచ్ఛకు పిల్లలు అడ్డుగా ఉన్నారనే వారికి గడ్డి మందు తాగించిందని ఆరోపించింది. తన కుమారుడు వెంకటేశ్ మృతి పట్ల కూడా అనుమానాలు ఉన్నాయని, ఉషకు సంబంధించి సెల్‌ఫోన్ డేటాను పరిశీలించాలని బుజ్జి డిమాండ్ చేసింది.

తల్లి ఆత్మహత్యాయత్నం...

పిల్లలకు గడ్డిమందు తాగించినట్లు అందరికీ తెలియడంతో మూడు రోజుల క్రితం ఉష ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమె సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకుని సోమవారం నీలోఫర్ ఆస్పత్రికి వచ్చినట్లు తెలిసింది.

విచారణ చేస్తున్నాం..

పిల్లలకు గడ్డి మందు తాగించిన ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేశ్ తెలిపారు. సిబ్బందిని హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి పంపి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.